# భూతద్దంలోంచి...

## 7

భోజనాలయ్యేసరికి రాత్రి తొమ్మిదిన్నరవుతోంది.

" ఉండిపో " అన్నది సుశీల.

" అమ్మో! వెళ్లాలి " అన్నాను.

"అసలే చలిగా వుందికదా ఉండిపోండి, మీవాళ్లు అర్ధరాత్రి వరకు మీకోసం ఎదురుచూస్తూ వుండరులెండి. ఈపాటికి నిద్రపోయివుంటారు " అన్నాడు సుశీల అన్నగారు సూర్యనారాయణ.

కానీ. నేను బయట వరండాలోకివెళ్ళి చెప్పులు వేసుకుని, మళ్ళీ డ్రాయింగు హాల్లోకివచ్చాను. నావాచిలో ఎనిమిది ముప్పావు ఐంది. ఆగి పోయింది. సూర్యనారాయణను టైము అడక్కుండా రేడియో ట్యూన్ చేసి అటుయిటుత్రిప్పి. టైముచూసి, సుశీల అందించిన పాన్ తీసుకున్నాను.

" అవునండీ, వెచ్చగా వుండేందుకుగాను సుశీ ఏడుమూళ్ళ పట్టు చీరెకూడా యిస్తుంది. అది కట్టుకుని పన్నెండు వరకు బ్రిడ్జి ఆడుకుని, ఆ తర్వాత మిఠాయి తిని, టీ త్రాగి..."

" లేదు సుశీ, పోవాలి " అన్నాను.

" చూడు. మొన్ననేకొన్న ముదురాకుపచ్చ రగ్గువుంది, ఇస్తాను. హాయిగా పడుకో " అన్నది సుశి.

సూర్యనారాయణ మాటలు యింకొంచెంవింటే అసలు కదల్లేనని భయం వేసింది. బేగ్ తీసుకుని వరండాలోకి వచ్చాను. "రిక్షా తెచ్చి పెట్టండిబాబూ_వద్దులెండి. అందాకా దింపివద్దురుగాని రండి" అన్నాను.

సూర్యనారాయణకి, అంతకంటే సుశీలకి బాగా తెలుసు నేను "పోతాను" అంటే, నా మనస్సులో ఉద్దేశ్యం "పోవాలి" అనే వుందని. అందుకనే అతను స్లిప్పర్సు వేసుకుని వచ్చాడు.

"జాగ్రత్త" అంటూ సుశి గేటువరకు సాగనంపింది.

"పదండి" అన్నాను నేను.

బైట బాగా చలిగా అనిపించింది. మబ్బు బాగా దట్టంగావుంది. ఒక నక్షత్రంకూడా కళ్ళకి కనుపించడంలేదు. ఒక ఫర్లాంగు దూరాన కనుపిస్తోంది పెద్దరోడ్డు. సందు చివరికి వచ్చేసరికి సన్న తుప్పర ఆరంభమైంది.

"నా మాట వినండి, వెనక్కిపోదాం" అన్నాడతను.

దోవన పోయే రిక్షా కేకేసి, బేరమాడాను. "వస్తాను, నాకేమీ ఫర్వాలేదులెండి. నిశ్చింతగా నిద్రపోండి. రేపు రింగప్ చేయమనండి సుశీని" అన్నాను నవ్వుతూ. "చలో" అని రిక్షావాడిని పురమాయించాను.

రిక్షా బయలుదేరింది. శరవేగాన సాగింది. చలిగాలి! పమిట దట్టంగా కప్పుకున్నాను. దూరాన ఎక్కడో రైలుపోతున్న ధ్వని, ఈ వానలో, చలిలోకూడా రైళ్లు నడుస్తుంటాయి, ఆ యింజనులో వున్నవాళ్ళ పని హాయి, వెచ్చగా...

చటుక్కున ఆపాడు రిక్షావాడు రిక్షాని. నేను ఉలిక్కిపడ్డాను. దిగి, బండి వెనకాలకి వెళ్లాడువాడు. నేను ఒక్కసారిగా వెనక్కి తిరిగి

"ఏమైంది?" అన్నాను. వాడు నవ్వి "యెనకాల పర్దా వేస్తుండానమ్మా" అన్నాడు.

నాకు చాలా చిరాకు, కొంచెం భయం కలిగాయి. "ఏమీ అక్కర్లేదు. నడు" అన్నాను. వాడు వెనకాలపర్దా విడిచి, ప్రక్కలనున్న తెరల త్రాళ్లుకూడా విడదీశాడు బండిలోకి చేయిపెట్టి. మెల్లిగా బయలుదేరింది రిక్షా. ఎందుకు వీడిల్లా ఆపాడు? చుట్టూ కలయచూశాను. ఒక వేపు పెద్దచెట్లు, వాటి చాటున ఒదిగి. మినుకు మినుకుమంటున్న వీధిదీపాలు, రెండోవేపు దిగులుగా పఱుచుకొనివున్న మైదానం. ఎక్కడో దూరాన వున్నాయి యిళ్లు.

నేను సాహసంచేసి బయలుదేరానా అని అనుమానం వేసింది. పది కావస్తోంది. వీడు నన్ను సక్రమంగా యింటికి తీసుకుపోతాడా అన్న భయం ప్రారంభమైంది. చటుక్కున రిక్షా చైను వూడిపోయిన ధ్వని ఐంది. ఒక లాంతరు స్తంభం దగ్గర రిక్షా ఆగింది మళ్ళీ. నామీద పూర్తిగా వెలుగు పడుతోంది. రిక్షావాడు వంగి చైను అటూయిటూ రెండుమార్లు త్రిప్పాడు. కానీ స్వాధీనం కాలేదు. గొణుక్కుంటూ లేస్తూ నావంక చూశాడు. నాగుండె ఝల్లుమంది. వాడి చింపిరిజుట్టు, మాసిపోయిన గడ్డం. ఎఱ్ఱని కళ్లు — నాకు హైదరాబాదులో ప్రొహిబిషను లేదన్న సంగతి గుర్తుకి తెచ్చాయి. ఒకే క్షణం చూశాడు నావంక. మరుక్షణం రిక్షా వెనుకకు వెళ్లి, చైను సరిచేశాడు. మళ్లీ రిక్షా బయలుదేరింది. అసలే చలిగా వుందేమో, దానితో నా శరీరంలో వణుకు ప్రారంభమైంది. వణికే వ్రేళ్లతో మెడ లోని గొలుసు, చేతులనున్న గాజులు తడుముకొన్నాను. ఛీ, యివన్నీ యిప్పుడే మిడిసిపడాలి! వెధవ నగలు నిజంగా ప్రాణానికే ముప్పు తెస్తాయి. మెడలోంచి మెల్లిగా గొలుసు తీశాను, చేతులనున్న గాజులు తీశాను. బేగ్ తెరచి అందులో పడేశాను. అసలు బేగ్ కదా ముఖ్యం, అట్టే డబ్బున్నా లేకపోయినా వీడిదృష్టి దీనిమీదే వుంటుంది అనుకున్నాను.

బేగ్ లోంచి చేతిరుమాలు తీసి, గొలుసు, గాజులు, ఉన్న నాలుగునోట్లు తీసి మూటకట్టి, నడుముకు దోపుకున్నాను. కొంచెంతెరిపిగా అనిపించింది.

మళ్లీ ఆగింది రిక్షా.

"ఎందుకు ఆపుతావు? ఇలాగైతే నేను మరోబండిలో పోతాను." అన్నాను.

"చౌరస్తా వస్తాదమ్మా, బత్తిపోయింది, జలాయించాల" అన్నాడు. జేబులోంచి అగ్గిపెట్టెతీసి, పుల్ల వెలిగించాడు. అదికాస్తా ఆరి పోయింది.

అర్ధరాత్రి కావస్తోంది — పీడి రిక్షాకి దీపం ఉందో లేదో చూడ్డానికే వున్నారా పోలీసులు! నాకు చాలా భయంవేసింది. చుట్టూ నిర్జనంగా వుంది. చెట్లు మాత్రం పెద్ద రొదగా ఆకులు గలగల లాడిస్తున్నాయి. ఎక్కడో కుక్క ఏడ్చిన చప్పుడు, ఇంకా ఎక్కడో దూరాన కారుహారను చప్పుడు. రిక్షావాడి దీపం ఎన్నిమార్లు వెలిగించినా వెలగలేదు. దేముడా, నాకేమిటి దారి? ఎల్లాగూ నాకు యీరోజు యీ దుర్ఘటన వ్రాసిపెట్టివుంది— నాడబ్బు, నగలైతే యిచ్చేస్తాను. వాడు నన్ను ప్రాణాలతో వదలిపెడితే! నా గొంతులో దుఃఖం బయలుదేరింది. భయంతో నాగొంతు మరింత బిగుసుకు పోయింది.

"దిగు అమ్మా, దిగు" అన్నాడు వాడు. ఏం ఎందుకు? అని డబాయించే ధైర్యంలేదు నాకు. నాగుండె ఝుల్లుమంటోంది. పదేపదే అంటోంది. వణుకుతూనే దిగి, క్రింద నిల్చున్నాను—పోనీ, పరుగెత్తుదా మంటే, కాళ్లల్లో సత్తువలేదు. చటుక్కున నామీద వెల్తురుపడింది. పెద్ద కారు మలుపు తిరిగి, యీవేపు వచ్చింది.

రిక్షావాడు "ఎక్కు" అన్నాడు, సీటును ఒకమాటు సవరించి. కారుదూసుకు పోయింది మమ్మల్ని. కారువచ్చింది కాబట్టి బ్రతికాను నేను.

భగవంతుడా, సుశీ వాళ్ళంతా చెబుతోంటే వినకుండా ఎందుకొచ్చాను యీ అర్ధరాత్రివేళ, నాకిల్లా వ్రాసిపెట్టివుంటే వాళ్ళు చెప్పినమాట ఎందుకు వింటాను ?

రిక్షా మళ్లీ బయలుదేరింది. రిక్షావాళ్ళ అత్యాచారాలకి అంతులేదు ఈరోజుల్లో. నిలువునా దోచేసి, దేనితోనో పొడిచేసి, పారిపోతారు. పట్టుకోవడం ఎవరితరం ? ప్రాణం పోయినాక, పట్టుకునిమాత్రం ఎవరు ఏమి చేయగలరు ?

ఘల్లుఘల్లుమంటున్నాయిగజ్జలు. నాహృదయం దడదడలాడుతోంది.

మా యింటిదగ్గరి రోడ్డు వచ్చేస్తోంది. ఈరోడ్డే మరీ నిర్జనమైందన్న సంగతి అందరికీ తెలుసు. వీడు అందుకనే అక్కడ విడిచిపెట్టాడునన్ను- యీ రోడ్డుసంగతి మనస్సులో ఉండబట్టే అటూయిటూ బ్రహ్మాండమైన గోడలు నవాబుగారి యింటి తాలూకువి. గొంతు చించుకున్నా వినిపించదు, కన్ను పొడుచుకున్నా కనిపించదు.

ఆ రోడ్డు ఎక్కాము, రిక్షావాడు దిగాడు, నా పెదిమలు వణక సాగాయి. మెల్లిగా నడిపిస్తున్నాడు వాడు రిక్షాని. ఆమలుపు తిరిగాము. మా గుమ్మం కనుపిస్తోంది. మా యింటి ఎదురుగా ఒక సన్నసందువుంది. వాడు చటుక్కున రిక్షాఎక్కి నన్ను ఆ సందులోకి తీసుకుపోతాడు. అయ్యో, మావాళ్ళయినా తలుపు తెరచి వుంచారుకాదు. ఏక్షణాన్నయినా సరే, రిక్షా దూకేయటానికి సిద్ధంగా వున్నాను నేను.

మా గుమ్మం ముందు రిక్షా ఆగింది. "దిగు" అన్నాడు వాడు. గద్దించినట్లుగావుంది వాడిమాట. దిగగానే నోరు నొక్కేసి, వున్నవి నాలుగూ దోచుకుంటాడు. కేకేస్తే పొడిచేస్తాడు. ఇందాక వాడు సీటు క్రిందనుంచి ఏదో తీశాడు. మందమతిని గమనించాను కాదు. అప్పుడే ఎలుగెత్తి అరిచాను కాదు.

మంత్రించినట్లుగా దిగాను. నాముఖం పాలిపోయి కళావిహీనంగా వున్నదని వాడు తెలుసుకుంటాడు. ఏమిటో వాడి చూపు.

"చిల్లరకావాలా ?" అన్నాడు. రుమాలు బయటకు తీసి నోట్లు తీస్తే. అమ్మో! బేగ్ తెరిచి ఖంగారుగా వెతికాను. చేతికందిన ఆరణాలు వాడి చేతిలో వేశాను. గబగబ మెట్లుఎక్కి మా తలుపుని సమీపించాను. హృదయం దడదడ కొట్టుకుంటోంది. తలుపు కొట్టడానికి వెనక్కి తిరిగితే, వెనకనుంచి గొంతు పట్టేస్తాడేమో !

"తలుప్కొట్టండి అమ్మా! ఇంతదేర్ అయింది. నిలబడతా నేను—చూశారా అమ్మా, నేను అనుకుంటుండాన్, అమ్మ కోక సినుగుతుందేమో అని—సెప్పలేదమ్మా. మొలవుండాదియీడ" అంచుదగ్గర పీలికగా వ్రేలాడుతున్న నా చీరెమీద లేదు నా దృష్టి.

వీడు నాకెంత మేలుచేశాడు యీరోజు. నా మనస్సు కృతజ్ఞతతో నిండుతోంది. మానాన్నగారు తలుపు తీసేలోగా, నేను వెనక్కి చూశాను. దీనంగా, ఎంతో మంచిగా నా ప్రాణదాతలాగా కనుపించాడు. చటుక్కున నా రుమాలు తీసి, ఓ రూపాయినోటు వాడి చేతిలోపెట్టి లోపలకు వెళ్ళిపోయాను.

తలుపులు మూసేసి, నా మంచంమీద వ్రాలేసరికి, నా కాశ్చర్యం వేసింది అప్పుడు. వాడు నాకు ఏమి ఉపకారంచేశాడని నేను వాడికి బహుమానం ఇచ్చాను ? నాకు నవ్వొచ్చింది. ఆ బహుమానం నిజానికి వాడు చేసిన ఉపకారానికి కాదు.

—వాడు చేయకుండామానిన అపకారానికి !

[1958]